# పాలకోడేటి సత్యనారాయణ రావు

# 'మంచిగంధం'




ఉత్తరం రాయటం పూర్తయింది. కవరులో పెట్టి అతికించాను. ఉత్తరం అందితే చాలు, రాఘవేంద్ర నా కోసం రైల్వేస్టేషన్‌కు వచ్చి తీరతాడని నాకు తెలుసు- అతన్ని కలుసుకొని అప్పుడే మూడేళ్ళు దాటిపోయింది. మూడేళ్లలో వాడేమీ మారి ఉండడు. స్నేహమంటే ప్రాణం పెట్టే తత్వం వాడిది. ఆ గుణం ఉండాలే కానీ, ఉంటే దాన్ని మార్చుకోవటం అంత తేలికైన పనేమీ కాదు:

**వాడూ, నేనూ ఒకే గదిలో ఉండేవాళ్ళం మూడేళ్ళ క్రితం! 'గది' అన్న పేరొక్కటి తప్పితే, దానికి ఆ లక్షణాలు ఏమీ ఉండేవికావు. పైగా— మాకు ఇంటి ఓనరుతో తగవు. దానికి మా తప్పేమీ కారణం కాదు.**

మా గది పక్కనే ఓ ఫామిలీ పోర్షన్ ఉండేది. కొత్తగా పెళ్ళయిన జంట ఒకటి, ఆవిడ తాలూకా చెల్లెలొకమ్మాయి ఉండేవారు ఆ ఇంట్లో. ఆ చెల్లెలు వుమెన్స్ కాలేజీలో బియ్యే వెలగబెట్టేది ఆ రోజుల్లో. ఆ కాలేజీలో ఏం చెప్పేవారో పాఠాలమాటయితే తెలీదు గానీ, ఆ పిల్లని చూస్తే రోజూ ఫ్యాషన్ పేరేడ్‌కు వెళుతున్నట్లుగానే ఉండేది మా కళ్ళకు. పెళ్ళి కాని వాళ్ళం....ఎదురుగా పంచ వన్నెల చిలక లాంటి పిల్ల, పైగా ఆ పిల్ల మేకప్ వరకు బ్యూటీ క్వీన్....రోజుకోరకంగా ఉండేది ఆ పిల్ల షోకు....ఓ రోజు జుట్టు వదిలేసేది....నీలవేణిలా ఉండేది. ఇంకోరోజున నడినెత్తిన ముడి వేసేది.... గంగ మీద ఒళ్ళుమండి, శివుడి జటాజూటంలోంచి గంగను లాక్కొని, తన నెత్తిన ముడేసి పెట్టుకున్న పార్వతిలా ఉండేది. మరో రోజు వాలుజడ వేసి వాలుచూపుల బాణాలు వదిలే మన్మథ రాణిలా ఉండేది. ఓ రోజు స్లీవ్‌లెస్ జాకెట్, ఇంకోరోజు బ్రాలెస్ బ్లౌజ్, మరోరోజు హాఫ్ స్లీవ్స్, ఓ రోజు చీర, ఇంకో రోజు పంజాబీ డ్రెస్, మరో రోజు మరోరకం డ్రెస్....ఈ పిల్లకి మేం 'గజ్జెల గుర్రం' అని పేరు పెట్టుకొన్నాం. నేను, రాఘవేంద్ర ఇద్దరమే ఉంటే ఆ పేరు....లేకపోతే 'గోడిగ' అనే వాళ్ళం. గోడిగ అంటే ఆడగుర్రం అని అర్థం. మదించిన ఆడగుర్రం అన్నా తప్పేమీలేదు.

గోడిగ అసలు పేరు పుష్పలత. 'పుష్పా' అని వాళ్ళక్క పిలిచేది. 'లతా' అని వాళ్ళ బావ పిలిచే వాడు. నేను, రాఘవేంద్ర చాలా కాలం ఆలోచించాం... మేం ఆ పిల్లను ఏ పేరుతో పిలవాలా అని చివరకు 'గోడిగ' కు మించినపేరు లేదుగాకలేదని నిర్ణయించుకొన్నాం.

ఓ రోజు పుష్ప స్నానం చేస్తోంటే రాఘవేంద్ర బయట నిలబడ్డాడు— బాత్‌రూంపక్కనే. కామన్ బాత్‌రూం అయితే ఏం చేస్తాం- లోపల ఒకరుంటే, రిజర్వేషన్ చేసుకొంటున్న రీతిలో నిలబడాల్సిందే గదా-కానీ ఆ రోజు లోపల పుష్ప ఉండటం బయట రాఘవేంద్ర ఉండటం యాదృచ్ఛికం అయినా, అది వాళ్ల బావ కంట్లో పడింది. 'లోపల నీళ్ళచప్పుడు వినటానికే నువ్విక్కడ నిలబడ్డావ్'అంటూ గొడవ పడ్డాడు వాళ్ళబావ. నిజానికి మాకు ఆ ఖర్మేం - పుష్పలతను-మన సినిమాల్లో యాక్టర్లకన్నా తక్కువ వస్త్రధారణలో మేం ఎన్నోసార్లు చూశాం-నాప్‌కిన్ సైజులో ఉండే టవల్ కట్టుకొని, ఆ టవల్‌లోనే పెద్ద సొగసుల్ని దాచుకొని తిరుగుతున్న రీతిలో మాకు కనువిందు చేసే. ఆ సుందరి. ఒకసారి కాదు, ఇదిగో- ఈ నెత్తి మీదున్న వెంట్రుకలన్నిసార్లు. అడగాలే గానీ - ఆ పిల్ల మాముందు కేబరే పెట్టమన్నా పెట్టి ఉండేదన్న సంగతి మాకు తెలుసు.

అయినా నిందపడింది మీద. పడ్డవాడు చెడ్డ వాడుకావన్నారు. కానీ మేం చెడ్డ వాళ్ళమే అయ్యాం- ఇంటి ఓనరు వచ్చి ఇల్లు ఖాళీ చెయ్యండి, పోకిరీ వెధవలకు ఇల్లివ్వను' అని గొడవపెట్టాడు. మేం ఖాళీ చెయ్యం అన్నాం- 'మేమాపిల్లకు కన్నుగొట్టామా, చెయ్యిపట్టుకొన్నామా, అని దబాయించాం. నిజానికి ఇవేవీ చెయ్యకపోవడమే మా తప్పని మాకు ఆ తర్వాత తెలిసింది— 'మీ రోగం కుదురుస్తా'నంటూ ఆ ఓనరు మా గదికి కరెంటు పీకేశాడు. కామన్ బాత్‌రూమ్ ఫెసిలిటీ మాకు రద్దు చేశాడు. అయినా ఆర్నెల్లు మేం చీకటిగదిలోనే కాలం గడిపాం, పంతానికి!

చివరకు నాకు పెళ్ళయింది, అరుణతో. అరుణకు హనుమకొండలో ఉద్యోగం కాబట్టి నేను వరంగల్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకొన్నా- ఇపుడు సుబేదారిలో కాపురం వెలగబెడుతున్నాం.

పెళ్ళయి ఇక్కడికొచ్చాక- మళ్ళీ వెళ్ళటం పడలేదు హైద్రాబాదుకు. ఇప్పుడు ఏదో ఆఫీసు పని తగిలింది. ఆ తర్వాత రెండు రోజులూ అక్కడే ఉండేందుకు నిర్ణయించుకొన్నాను.

ఫలితమే ఈ ఉత్తరం. దీన్ని రేపు పోస్టు చెయ్యాలి. అని గుర్తుపెట్టుకొనేందుకు దాన్ని తీసి మా సెక్షన్‌లో ఉండే మేగజైన్ క్లబ్ నుంచి తెచ్చిన పత్రికలో పెట్టాను-అప్పుడు చూశాను ఆ పత్రికలో ఆ బాక్స్ అయిటమ్!


'రాఘవేంద్ర కథలకు నేనే మూలం!' అని ఉంది దానిమీద. పక్కనే ఓ రచయిత్రిగారి ఫోటో. సావకాశంగాతీసి చదివాను. 'రాఘవేంద్ర ఈ రోజు కథా రచయితగా ఎదగటానికి నేనే కారణం. ఎన్నో కథల్ని నేను అతనికి వినిపించాను. వాటినే అతను అటూఇటూ రంగులద్ది తనవిగా చలామణి చేసుకున్నాడు!' అని చెప్తోందా రచయిత్రి....ఆవిడ పేరు సురభి.

సురభి ఫోటో పరిశీలనగా చూశాను....తనను ఎక్కడా చూసిన గుర్తు లేదు. మేం ఇద్దరం కలిసి ఉంటున్నపుడే రాఘవేంద్ర తరచూ నన్ను తనతో తీసుకెళ్ళేవాడు. ఓ సారి వాళ్ళింటికి, ఇంకోసారి ఇంకోరి ఇంటికి....అక్కడికి వెళ్ళేంతవరకే రాఘవేంద్రకు నా మీద ఇంటరెస్ట్. ఆ ఇంటోకి వెళ్ళాక 'రాఘవేంద్ర నన్ను ఓ సోఫాలోనో, కుర్చీలోనో కూర్చోమనేవాడు. ఆ తర్వాత నే నింక అక్కడ 'సెట్ ప్రాపర్టీ' లాగా ఏ పనీ లేకుండా ఉండే వాడిని. రాఘవేంద్ర వాళ్ళతో చాలాసేపు ఏవేవో మాట్లాడేవాడు....చివరకు వచ్చేటప్పుడు వాళ్ళ కథల్ని. తన భుజాలమీద వేసుకు తీసుకొచ్చేవాడు. 'ఎందుకవి?' అనడిగితే 'దిద్దేందుకు' అనేవాడు. 'దిద్ది...?' అంటే ఫలానా పత్రికలో అచ్చు వేయిద్దాం' అనేవాడు. ఇదంతా ఎందుకొచ్చిన శ్రమో అర్థం అయ్యేదికాదు నాకు.

అయినా వాడి గొడవ వాడిది, అని ఊరుకొనే వాడిని.

—ఇపుడు సురభి అంటున్నది, చెప్తున్నది వింటోంటే-ఆశ్చర్యం అనిపించింది. ఇది నిజం అయి ఉంటుందా అన్న సందేహమూ పీడించటం ఆరంభం అయింది.

ఎలాగూ హైదరాబాద్ వెళ్తున్నాను గదా. అక్కడే అన్ని విషయాలు తేల్చుకోవచ్చు ననిపించింది.



—మొత్తానికి అనుకొన్న రోజుకి హైదరాబాద్ చేరుకొన్నాను. రాఘవేంద్ర నాకు మనస్ఫూర్తిగా స్వాగతం చెప్పాడు. ఇంటికి తీసుకెళ్ళాడు.-ఇల్లింకా నిజానికి 'ఇల్లు' కాలేదు.

"శుభలేఖ పంపలేదనుకో నువ్వు. అయినా అడుగుతున్నా-ఇంకా కాపురం పెట్టలేదుట్రా!" అనడిగా.

రాఘవేంద్ర నవ్వాడు- "నీకు తెలీకుండా పెళ్ళేమిట్రా అడుగుతున్నావ్ కాబట్టి చెప్తున్నా ఇంకా మహా అయితే ఓ రెండు నెలలు. సీత ఇక్కడే ఉద్యోగం చేస్తోంది-ఏజీలో!"

"కంగ్రాట్స్ ఇంకైనా కనీసం వెధవ్వేషాలు వెయ్యటం మానెసెయ్" అన్నాను.

"నిజం చెప్పు-ఎపుడైనా మనం వెధవ్వేషాలు వేశామా?

"దానికి గోడిగనే అడగాలి మనం సమాధానం చెప్పమని"

"పుష్ప ఇపుడు నాకు మంచి ఫ్రెండ్." అన్నాడు రాఘవేంద్ర.

నా పక్కనే పిడుగు పడినా నేను అంతగా ఉలికిపడే వాడిని కాను-గజ్జెలగుర్రం ఎలియాస్ గోడిగ ఎలియాస్ పుష్పలత....ఇపుడు రాఘవేంద్రకు బెస్ట్ ఫ్రెండ్.... నమ్మశక్యం కాదు. అదే అన్నాను—

"పాత రోజులు వేరు, ఇప్పటివి వేరు" అన్నాడు రాఘవేంద్ర అసలు జోకు చెప్తా విను-పుష్పలత వాళ్ళ బావనే పెళ్ళి చేసుకొంది, రెండో పెళ్ళాంగా సుఖంగా ఉంటోంది"

—ఇదింకా ఆశ్చర్యాన్ని కలిగించింది నాకు.పుష్పలత-అంత చదువూ చదివి చివరకు రెండో భార్యగా స్థానాన్ని అంగీకరించటం!

ఎందుకో నా కది నచ్చలేదు. చివరికి ఎవరి కథైనా విషాదాంతమే అంటుంటాడు రాఘవేంద్ర. కానీ పుష్పలత కథ మధ్యలోనే విషాదాంతం అయిపోయిందనిపించింది.

"పోనీ, పుష్పలత సంగతి వదిలెయ్ ఈ సురభి గొడవ ఏమిటి?" అనడిగాను.

"చదివావన్న మాట" అంటూ నవ్వేశాడు రాఘవేంద్ర. ఒక్క సురభి అనేం ఖర్మ, ఇదేమాట రామరాజూ అంటున్నాడు."

"రామరాజు...." -రామరాజు నాక్కూడా బాగా తెలుసు. మూడు నాలుగేళ్ళ కిందట మాకు పరిచయం అయ్యాడు. రాఘవేంద్రకు అభిమానిగా ఆరంభమయింది రామరాజు సాహిత్య జీవితం. "ఉత్తరాలు ఇంత బాగా రాస్తారే, కథ లెందుకు రాయకూడదూ?' అనడిగాడోసారి రాఘవేంద్ర.


మరుసటి సారి వచ్చేటప్పుడు రామరాజు ఓ కథ 'రాసి' తెచ్చాడు....దాన్ని రాఘవేంద్ర దగ్గరుండి సరిచూశాడు. అచ్చులో పోయించాడు తెలిసిన పత్రిక సంపాదకునికి యిచ్చి ఆ తర్వాత ఇంకో కథ....అలా సాగిందా కథ. ఇపుడు రామరాజుకు సైతం కథా రచయితగా ఓ గుర్తింపు వచ్చింది. అందుకే కాబోలు.... గురువుకే పెడుతున్నాడు పంగనామాలు.!


నవ్వేశాడు రాఘవేంద్ర.

ఇద్దరం హోటల్లో భోజనం చేశాము....రాఘవేంద్ర ఆ తర్వాత నన్ను రిజర్వు బ్యాంక్‌కు తీసుకెళ్ళాడు. కాష్ కౌంటర్ల వెనక కూర్చుని ఉంది పుష్పలత. మమ్మల్ని చూసి "అయిదు నిమిషాలు అని చెప్పి ఖచ్చితంగా అలాగే బయటకు వచ్చేసింది. గోపీ హోటల్లో దూరాం.

పుష్పలత ఇపుడు కొంచెం లావెక్కింది. ఒళ్ళంతా గతంలో కన్నా ఆకర్షణీయంగా తయారయింది. నుదుటిమీద పాపిడి దగ్గర కొంచెం కుంకుమ అద్దింది. అది చూస్తుంటే నవ్వి అంది...."మీకు తెలుసో లేదో, నాకు పెళ్ళయింది. అక్క మొగుడే నా మొగుడూనూ!"

క్షణం ఆగి అడిగాను...."మీ రేమీ అనుకోరన్న ధైర్యంతో అడుగుతున్నా- ఈ పనెందుకు చేశారు? శుభ్రంగా ఫ్రెష్ మారేజీ చేసుకోక...."




"ఏం చెయ్యను-పెళ్ళికాకముందు మీలాంటి వాళ్ళంతా నన్ను చూసి పెదాలు తడుపుకోవటమే తప్ప ధైర్యం చేసిన పాపం చెయ్యలేదు మరి. ధైర్యం చేసి చెయ్యి పట్టుకొన్న బావ పాణిగ్రహణమే గతి అయింది నాకు! అక్కా ఒప్పుకొందిలెండి- అయినా మీకు తెలిదా ఏం-ఇపుడు ఇదే ఫ్యాషన్. మన సినీ స్టార్స్ అంతా ఇంతే కదా-షబానా, స్మిత, వగైరా వగైరా...."

పుష్పలతతో గతంలో నేను పెద్దగా మాట్లాడి ఎరగను. కానీ ఆ అమ్మాయి ఇపుడు మాట్లాడే తీరు నిజాయితీగా ఉంది.

"కట్నం ఇచ్చుకోలేని మాలాంటి వాళ్ళకు కాలం కలిసి రాకపోతే ఏం చేస్తాం- ఎవడో ఒకడు తోడు ఉండాలి గదా- అయినా మా ఆఫీసులో వాళ్ళకు తెలీదు ఇదేమీ - ఆయనకు నేనొక్కత్తినే భార్యనని వాళ్ళ ఉద్దేశం-ఎవరైనా మామూలుగా అలాగే అనుకొంటారు గదా! తెలిసే రోజు వస్తుంది. రానీండి. నాకులేని బాధ వాళ్ళకెందుకూ?"

రాఘవేంద్ర క్షణం ఆగి అన్నాడు- "తెచ్చారా?"

పుష్పలత బ్యాగ్ తీసింది. అందులోంచి కొన్ని కాగితాలను బయట పెట్టింది. రాఘవేంద్ర అందుకొన్నాడు?. "చూస్తాలెండి! మళ్ళీ కలుద్దాం" అంటూ బయటకు నడిచాం.

ఈ సారి తిన్నగా....వాటర్ వర్క్స్ ఆఫీసుకు అక్కడ బయట చెట్టుకింద నన్ను నుంచోబెట్టి లోపలికి వెళ్ళాడు. పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు. కూడా ఎవరో ఇంకో అమ్మాయి. పరిచయం చేశాడు.... "ఈ విడ పేరే సుధ. కథలు రాస్తుంటారు ఈవిడ."

....నాకు అర్థమయింది కథ ఏమిటో!

మళ్ళీ దిద్దేందుకో కథ కాబోలు....బేతాళుడి శవాన్ని విక్రమార్కుడు మోశాడో లేదో

గానీ....వీడు మాత్రం ఈ కథల కట్టల్ని ఇలా మోయటం చూస్తున్నా

సుధ...వాడికి ఏకంగా నాలుగు కథలిచ్చింది. అన్నీ చూస్తా నంటూ హామీ ఇచ్చాడు. 'చూస్తా' నని వాడు హామీ 'ఇచ్చాడ'ంటే.... అవి అచ్చుఅయి రావల్సిందేనన్న సంగతి తెలుసు నాకు.

సుధ దగ్గర సెలవు తీసుకున్నాక....బయటకు రాగానే అంత సేపూ మౌనంగా ఉంటూ వచ్చిన నేను ఇంక ఊరుకోలేక పోయాను.

"నికసలు బుద్ధొస్తుందా?" అనడిగాను.

"ఏమయింది, అలా అడుగుతున్నావ్?", అమాయకంగా అడిగాడు రాఘవేంద్ర.

"సురభి పత్రికల్లో చెప్పింది-రాఘవేంద్ర రాస్తున్న కథలన్నీ నావేనని రామరాజు ఆ మాటే అన్నాడని నువ్వే చెప్పావ్ గతంలో కోటేశ్వరరావు ఇలాగే అనటం నీకూ నాకూ తెలిందిగాదు వాళ్ళన్నది చాలదా, ఏం? ఇపుడు పుష్పలత, సుధ.... వీళ్ళ కథలు పోగు చేసుకొంటున్నావ్?

రాఘవేంద్రనవ్వాడు- "నిజమే నేనూ అనుకొంటా, ఇలా ఎందుకు చేస్తున్నా నా, అని. అయినా నాకే తెలీదు. అదో రకం వీక్ నెస్ అనుకొంటా"

"ఆడాళ్ళంటేనా?...."

"ఛ, నువ్వూ అలా అంటే నేనేం అంటాను. చెప్పు ఆడాళ్ళ వీక్‌నెస్సే అయితే రామరాజు, కోటేశ్వరరావు వీళ్ళ మాట ఏమిటి?... నాది టాలెంట్ హంటింగ్. కొత్తగా రాసేవాళ్ళను టాప్‌చేసి వాళ్లకు మెలుకువలు నేర్పటం.... ఓ రకంగా ట్రెయినింగ్ అనుకో."

"ఏం వస్తుంది నికు దీనివల్ల-నాలుగు కథలు పడిగానే, వాళ్ళకు కొమ్ములొస్తాయి. దానితో నిన్నే పొడుస్తారు. రాఘవేంద్రగాడికి కథలు రాయటం ఏంవచ్చు! నే చెప్తోంటే రాసుకున్నవే అవన్నీ అని ఒకరంటే వాడసలు రచయితేకాదని ఇంకోరు అంటారు."

"అంటారు ఆ సంగతి నాకూ తెలుసు."

"మరెందుకు చేస్తున్నావ్ ఈ సేవ."

"నేను అదిచెయ్యకుండా ఉండలేను గనుక! నా దగ్గర అక్షరాలు దిద్దడం నేర్చుకొన్న వీళ్ళు రేపు నన్ను విమర్శిస్తే, నా మీద అంభాండాలు వేస్తూ పత్రికలో ప్రకటన ఇస్తారు. నిజమే.... కానీ.... ఒక మాట- నన్ను అలా అని, వాళ్ళు ఇంటికెళ్ళి అద్దంలో తమ ముఖం చూసుకోగలరా? అది వాళ్ళకు వికృతంగా కనపడదూ? అలాటి వాళ్ళను నేనేమీ అనను. అనక్కర్లేదు! వాళ్ళ మనసే వాళ్ళను శిక్షిస్తోంది. ఆ తరాత్వ కాగితం మీద కలం పెట్టెందుకు భయపడతారు. అక్షరాలు వాళ్ళను శపిస్తాయి. ఇంకెందుకూ, నెను చెయ్యి చేసుకోవటం! పొరపాటు! వాళ్ళు నన్ను తిట్టినా, అ తర్వాత వాళ్ళు రాసిన ప్రతి అక్షరం వెనకా నేనున్నానన్న సంగతి వాళ్ళకు తెలుస్తూనే ఉంటుందిగదా. పైకి ఎక్కాక, నిచ్చనను కాలితో తన్నేరకాలు వీళ్ళు! వాళ్ళగురించి ఆలోచించటంకూడా దండగే!" అన్నాడు రాఘవేంద్ర.


అప్పుడుచూశా రాఘవేంద్ర కేసి- వాడిప్పుడు నాకు కొత్తగా కనిపిస్తున్నాడు, కట్టెలమూటలో పడ్డ చందనపు ముక్కలా ఉన్నాడు. తనకున్న సుగంధాన్ని వాటికి పంచే ప్రయత్నం చేస్తున్నాడు. వాటికి ఆ అర్హత లేకపోవటం వాడి తప్పుగాదు వాటి లక్షణం అది. అంతే!!

రా. వెడదాం. చిన్న పని ఉంది!" అంటున్నాడు రాఘవేంద్ర.


"ఎక్కడికి?" అనడిగాను.

"నిన్న ఫోన్ చేసింది- సుజాత అని ఒకావిడ! ఆలిండియా రేడియోలో అనౌన్సర్. కథొకటి రాసిందట చూస్తారా. అని అడిగింది. ఈవేళ వస్తానని చెప్పా. ఎదురుచూస్తుంటుంది." అంటూ రాఘవేంద్ర తన మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు, నా జవాబుకు ఎదురుచూడకుండానే!

వెళ్ళి వెనక సీటుమీద కూర్చున్నాను- అంత ఎండలోనూ నా కెందుకో చలువపందిళ్లు ఎవరో పర్చినట్లుగా ఉంది- మంచిమనసు నీడ అలాగే ఉంటుంది కాబోలు!! ◆




సరికొత్త ఫీచర్ ప్రారంభం!



# నాకు నచ్చని మా ఆవిడ వంటకం!

ఆ వంటకం భలే తమాషాగా ఉంటుంది లెండి. శ్రీమతి అందులో శనగ పప్పు పోస్తుంది. చప్పగా వుండే సొరకాయలా గట్రా వేస్తుంది. ఇంకా అవీ, ఇవీ ఏవేవో చాలా కలుపుతుంది.

విశేషమేమంటే తెలుగు సినిమా లాంటి, ఇంగ్లీషు నుంచి కాపీ కొట్టిన తెలుగు కంపు సీరియల్ లాంటి ఆ కూరను తరచుగా చేయదామె. బంధువులు- ముఖ్యంగా నా తరపు వాళ్ళు వచ్చినప్పుడే చేస్తుంది. చచ్చినట్టు తింటాననుకోండి.

సిటీలైట్స్‌లో సెక్స్ డోస్ ఎక్కువయిందని ఆమెకు అనిపించినప్పుడు కూడా ఆ "అద్భుత వంటకం"-తయారవుద్ది మా ఇంట్లో. ఆ మధ్యోసారి చాలా అభిమానంగా అంది కూడా కందనాతి గార్ని భోజనానికి పిలుద్దామని !!

—కంఠంనేని రాధాకృష్ణమూర్తి

"ఆవిడ" లకు భయపడని పాఠకులెవరైనా ఈ ఫీచర్‌లో పాల్గొనవచ్చు. ముఖ్య గమనిక : రచనతో పాటు "ఆవిడ" గారి పర్మిషన్ కూడా పంపాలి.

—ఎడిటర్